# వ ల

కొండంత కోపంతో ఇల్లుచేరుకున్నాడు సీతాపతి — గబగబా యూనిఫారం విప్పి ఓమూలగిరవాటేశాడు— నైట్ డ్యూటీచేసి తెల్లార్లూ మేలుకొని ఇంటికి రాగానే సాదరంగా ఎదురై కమ్మటి వేడి వేడి కాఫీ అందించేటందుకు శ్రీమతి ఇప్పుడు లేదు. అందుకే అతగాడి కోపం—

బ్రెష్ నోట్లో పెట్టుకుని కసికొద్దీ వేపపుల్ల నమిలినట్టు 'కస కస' నములుతూ ముంచుకొచ్చిన కోపంతో 'ప్రైమాస్టౌ' వెలిగించాడు—

రత్తాలు పిలుపుకి వులిక్కిపడి స్టీలు గిన్నె తొల్చి తీసుకొచ్చి పాలుపోయించుకుని స్టౌమీద కెక్కించాడు.

దొడ్లోకెళ్ళి నోరు పుక్కిలించుకొచ్చేసరికి పాలు కాగటం పూర్తయింది. స్టౌమీద కాగిన పాలకిమల్లె సీతాపతి మనసు కూడా సల సల మరిగిపోతోంది కోపంతో — దిక్కుమాలిన చాకిరీ! — అన్నీ తనే చేసుకోవాలి! —

అయినా పుట్టింట్లోవున్న శ్రీమతిమీద విసుక్కుంటే మాత్రం ఏం ప్రయోజనం! — తప్పంతా తనది —

ప్రభుత్వంవారు ప్రతినిత్యమూ పేపర్లో వేయిస్తున్నా... రేడియోలో గొంతుచించుకుంటున్నా... ఎర్ర త్రికోణం గుర్తుతో గోడలన్నీ ఖరాబు చేస్తున్నప్పటికీ తనే బుద్ధి తక్కువ పని అయిదోసారి మళ్ళీచేయటంతో ఈనాడు తనకీ ఖర్మపట్టింది! —

ఖర్చు తగ్గుతుందిగదాని సంతానంతోసహా తన సంతాన లక్ష్మిని పురిటికి పుట్టింటికి తరిమేశాడు.—మరి... ఇప్పుడు ఇంట్లో ప్రతిపనీ తనే చేసుకోవాల్సి వచ్చిందని వాపోతే ఏం లాభం?—

పగలూ రాత్రీ భేదంలేకుండా డ్యూటీ చేయాల్సిన వుద్యోగం సీతాపతిది! — ఇలాంటి వుద్యోగానికితోడు, ఈసురోమంటూ ఇల్లు చేరుకున్నాకకూడా తనే చెయ్యి కాల్చుకోవాల్సి వచ్చేసరికి మరింత కష్టమనిపిస్తోంది—

వేడివేడి బ్రూకాఫీ గొంతులో పోసుకుని వాలుకుర్చీలో నడుంవాల్చి అప్పుడే వచ్చిన న్యూస్ పేపరు తిరగేస్తున్నాడు.

ఇంతలో పెద్దవాడు "గిరి" కళ్ళముందు మెదిలాడు-పిచ్చి సన్నాసి ఏం చేస్తున్నాడో-బ్రూకాఫీ అంటే వాడికెంతో ఇష్టం-వాళ్ళ తాతగారింట్లో ఏ కంట్రీ కాఫీ తాగుతున్నాడో?

పేపరు చూస్తూన్నాడన్న మాటేగానీ నిద్రతో కళ్ళు మూసుకుపోతున్నాయ్... ఆవలింతలూ వస్తున్నాయ్... విసుక్కుంటూ పేపరు మడిచి పక్కన పెట్టి సిగరెట్ వెలిగించేడు.

రెండోవాడు "బాబు" గుర్తొచ్చాడు- రెండోవాడంటే తనకి ప్రాణం! తనను విడిచి ఈ రెండు నెలలుగా వాడెలా వుండగలుగుతున్నాడో పిచ్చి వెధవ!...

అదిసరే...ఇంతకూ శ్రీమతి దగ్గరనుంచి తనకు జాబంటూ వచ్చి పదిరోజులకు పైగా అయింది. జానకి వంట్లో ఆరోగ్యంయెట్లావుందో? ప్రసవించే రోజులు వచ్చివుంటాయ్... మామగారు ఈసారైనా జానకిని ఆపరేషన్ చేయించుకోమంటాడో...లేదో?—

ఇన్నిటి గురించి ఆలోచిస్తూ నిద్రలోకి జారబడ్డాడు సీతాపతి!—

సార్! టెలిగ్రాం అనే మెసెంజర్ కేక విన్పించటంతో తత్తరపడి లేచాడు.

జానకి డెలివర్డు మేల్ చైల్డ్- మదర్ బేబీ సేఫ్—అనే మాటలు చదివి మనిషి ఆనందంతో వుబ్బిపోయాడు.

మళ్ళీ మేల్ చైల్డ్! అయ్యబాబోయ్—

సీతాపతి సంతోషంతో మెలికలు తిరిగిపోయాడు.

అయితే వెంటనే బయల్దేరి వెళ్ళాలి?— రెండు... లేదు...నాలుగు! కానేకాదు వారం రోజులు శెలవుపెట్టి మరీ బయల్దేరాలనుకున్నాడు—

పదిగంటలకెల్లా స్నానం పూర్తి చేసుకుని వూరు వెళ్ళే వుద్దేశ్యంతో రోడ్డుమీదికొచ్చాడు—

తనిప్పుడు ఆఫీసుకెళ్ళి శలవు శాంక్షన్ చేయించుకుని ఇప్పటికిప్పుడే ఊరు బయల్దేరి వెళ్ళాలి.

శలవైతే శాంక్షనవుతుంది?- మరి డబ్బులో?- అసలే నెలాఖరు రోజులు! - అందులోనూ అత్తవారింటి కెళ్ళట మాయె?-

రైలుఖర్చు ఎట్లాగూ లేదు-మరి పైఖర్చుకైనా పాతిక రూపాయలు కావాలి!-

ఈ సంవత్సరం రైల్వేపాసులన్నీ అప్పుడే వాడేసు కున్నాడు-మరి...పాసు లేకుంటే అంతదూరం వెళ్ళటం ఎట్లా?-

శలవు శాంక్షన్ చేయించుకొని ఆఫీసులోంచి బైటపడి స్టేషన్ వైపు నడిచాడు-

అదృష్టవశాత్తూ గార్డు గోపాలం ఎదురయ్యాడు-

"ఏరా గురూ డ్యూటీకేనా? -" అడిగేడు.

"నైట్ డ్యూటీ చేశాను బ్రదర్!- ప్రస్తుతానికి శలవు పెట్టి వూరెళ్తున్నాను..." సీతాపతి సంతోషంగా అన్నాడు.

"ఏమిటి విశేషం?"

"మరేం లేదు. మరో అబ్బాయి పుట్టాడు. చూసొద్దామని"

"కన్ గ్రాచ్యులేషన్సు!- మరి పార్టీ ఏదోయ్"

"పార్టీకేంగానీ... మరోమాట! నేను ఆఫ్ డ్యూటీలో వెళ్ళాలి. నా దగ్గరై తే పాసుగానీ... పి. టి. వో. గానీ లేదు. అంత దూరం ఎలా ప్రయాణం చేయటమాని..."

"భలేవాడివిరా!- టిక్కెట్ ఎగ్జామినర్ని... నిన్నెవర్రా పాస్ అడిగేది?- అడిగేవాడికెన్ని గుండెలుండాలి? అయినా డోన్ట్‌వర్రీ!- వూరికెళ్లాల్సి వస్తుందేమోని నేను మొన్ననే పాస్ తీసుకుని వుంచాను. దాన్ని నువ్వు వినియోగించుకో ఇంద!" గోపాలం జేబులోంచి పాస్‌తీసి సీతాపతికి అందించాడు.

సీతాపతి ముఖం చాటంతైంది.

"థ్యాంక్యూ బ్రదర్- తిరిగిరాగానే నీకు మళ్లీ రిటర్న్ చేస్తాను."

ట్రయినొచ్చి ప్లాట్ ఫారంమీద ఆగింది.

అదేట్రయిన్‌కి గోపాలం గార్డు కావటంతో శీతాపతి కూడ వెళ్ళి గార్డువేన్లోనే కూర్చున్నాడు కాలక్షేపంకోసం.

గోపాలం విజిల్‌వూది పచ్చజండా చూపించాడు. ట్రయిన్ కదిలి తొందర్లోనే వేగాన్ని పుంజుకుంది.

పచ్చజండా పక్కన పెట్టి వచ్చికూర్చుంటూ "వరే సీతాపతీ నువ్వు చాలా అదృష్టవంతుడవోయ్. నీది స్టేషనరీ జాబు. నేనుచూడు ఇలా జండా వూపుకుంటూ ఆజన్మాంతం తిరుగుతూ వుండాల్సిందే—" అన్నాడు జండాగోపాలం.

"నాకష్టం నాకూ వుందిలే గురూ. ఒక రోజు పగలు మరొకరోజు రాత్రిపూట దయ్యంలాగ స్టేషన్లో పడి కాపులు

కాయాల్సిందే! పదిడబ్బులు గిట్టుబాటవుతయ్యన్నమాటే గాని...వుద్యోగం బోర్ కొట్టేస్తుందంటేనమ్మ..."

ఆమాట ఈమాట చెప్పుకుంటూ కాలక్షేపం చేశారు-

బాపట్ల స్టేషన్ రాగానే! శీతాపతి! నువ్విక్కడ కూర్చుని కునికిపాట్లుపడ్డేవు గానీ, వెళ్ళి సెకండ్ క్లాస్ కంపార్టుమెంట్లో పడుకుని రెస్టుతీసుకో... అన్నాడు గోపాలం.

సరేనని తలూపిన శీతాపతి వచ్చి సెకండ్ క్లాస్ కంపార్టు మెంటులోకి జొరబడ్డాడు.

పేరుకు సెకెండు క్లాస్ కంపార్టుమెంటే అయినా... కొత్తగా రిలీజైన జానపద చిత్రానికి నేలలో వున్నంతమంది జనం లేకపోయినా ..... పల్చగా కంపార్టుమెంటును సరిపడా వున్నారు ప్రయాణీకులు.

తనూ ఓమూల చోటుచేసుకుని కూర్చున్నాడు శీతాపతి—

చీరాల స్టేషన్ లో ఓ అరడజను మందిదాకాదిగి పోవటంతో శీతాపతికి పడుకునేటందుకు చోటుదొరికింది.

అసలు పైబెర్తు మీదే పడుకోవాలనుకున్న సీతాపతి ఆలోచనకు... మరెవ్వరో అంతకుముందునుంచే ఆక్యుపై చేసుకొని వుండటంతో ఇక తప్పనిసరిగా లోయర్ బెర్తు మీదే విశ్రాంతి తీసుకోక తప్పలేదు.

చీరాల స్టేషన్లో ట్రైన్ బయల్దేరబోయే ముందు గోపాలంకూడా జండాలు పుచ్చుకుని శీతాపతివున్న కంపార్టు

మెంట్లోకే వచ్చేసి తనపని యథావిధిగా నెరవేరుస్తున్నాడు.

"అదేమిట్రా నువ్వూ-ఇక్కడికి వచ్చేశావ్" శీతాపతి ప్రశ్న —

"ఏం చెయ్యమంటావు సీతాపతీ—నా పక్కడికే గార్డు వేన్లో తోచి చావటం లేదు — కాస్సేపు నీతో బాతాఖానీ కొట్టచ్చుగదాని నేనూ మకాం మార్చాను..." కూర్చుంటూ అన్నాడు గోపాలం.

"వెరీగుడ్ నాకూ ఎట్లాగూ నిద్రవచ్చేట్లు లేదు—"

"చూడు సీతాపతీ! — ఇప్పటికే కిలో బియ్యం రెండు రూపాయలకు పైగా అమ్ముతున్నారు— ఫామిలీ ప్లానింగ్ పాటించకుండా నువ్విట్లా జనాభాని పెంచుతూ పోతుంటే ఒక సిగరెట్ రూపాయి అమ్మే రోజొస్తుంది..."

"అదే నేనూ ఆలోచిస్తున్నాను..."

"నువ్విట్లాగే ఆలోచిస్తూ వుండు... అంతలోనే కుటుంబ రావు అయిపోతావ్. ఆ తర్వాత జీతంచాలక అప్పులపాలవు తావ్—"

"అందుకే అయిదుగురూ లేక ఆరుగురూ... ఆగో ఛాన్సు. ఇక ఫుల్‌స్టాప్ ఎర్రజండా వూపేస్తాను అంతే!"

ఇద్దరూ నవ్వుకున్నారు—

వీళ్ళమాటలకి పై బెర్తుమీదున్నాయనికి డిస్టర్బెన్సుగా తోచటంతో తలవంచి క్రిందికోమారు చూచాడు తీక్షణంగా...

రైలు ఒంగోలు స్టేషన్ చేరుకుంది.

సీతాపతీ, గోపాలం ఇద్దరూ కంపార్టుమెంటు దిగి కేంటీన్ వైపు దారితీశారు.

"సరే నువ్వెళ్ళి రెస్టు తీసుకో... నేమళ్లీ కలుస్తాన్లే" అనేసి గోపాలం గార్డువేన్ వేపు నడిచాడు—

సిగరెట్ ముట్టించి సీతాపతి వచ్చేసి తన యధాస్థానంలో కూర్చుండిపోయాడు.

రైలు మళ్ళీ పరుగు ప్రారంభించింది.

పై బెర్తుమీదున్న ఆగంతకుడు కిందికి దిగి సీతాపతి పక్కనే కూర్చుంటూ అగ్గిపెట్టె అడిగి తీసుకున్నాడు—

"అయితే మీరు రైల్వే వుద్యోగులన్నమాట...చాలా సంతోషం" అగ్గిపెట్టె తిరిగి ఇస్తూ అన్నాడు...

అవునన్నట్టు చిరునవ్వొకటి విసిరేశాడు సీతాపతి.

"అన్నట్లు... మీరెక్కడదాకా ప్రయాణం...మద్రాసు దాకా వెళ్తున్నా..." ప్రక్కనున్నవారిని ఏదో అడగాలి గనుక మర్యాదగా అడిగేడు సీతాపతి"

"కాదండీ... బిట్రగుంట వరకే!..." సిగరెట్ పొగ తమాషాగా ముక్కుల్లోంచి వదుల్తూ జవాబిచ్చాడు ఆగంతకుడు.

"రైల్వేలో ఉద్యోగం దొరికినంత అదృష్టం వేరొకటి లేదు చూడండి—"

"ఏమిటలా అంటున్నారు..." సీతాపతి ఆశ్చర్యంగా కళ్ళు పెద్దవి చేశాడు...

"మరేం లేదు— మీలాంటి వాళ్ళు ఎక్కడికి ప్రయాణం చెయ్యాలనుకున్నా...పైసా ఖర్చు లేకుండా వెళ్ళిపోగల్రు...

"అదేం కాదండోయ్..." నవ్వేస్తూ అన్నాడు సీతాపతి.

"మరి..."

"సంవత్సరానికి ఆరుసార్లు మాత్రమే అథరైజ్డు...''

"అంటే..."

"రైల్వేవారి ధర్మమాని... సంవత్సరానికి మూడు పాసులు—మూడు పీ. టి. వోలు ఇస్తారు."

"అలాగా... ఇంకేముండీ..."

"ఆఁ... మీ చాదస్తంగానీ అవి మాత్రం సరిపోతయ్ టండీ..."

"భలేవారండీ... మామూలు ప్రయాణీకులందరికంటే మీరెంతో నయం .."

నయమేననుకోండీ...నవ్వుతూ అన్నాడు —

మీరు పాసులూ,.. పీటీవోలు అన్నారే రెంటికీ తేడా ఏమిటీ?—

పాసంటేనేమో పూర్తిగా ఫ్రీ అన్నమాట... పీ. టీ. వో. అంటే కొంత ఛేర్ మేం చెల్లించాల్సి వుంటుంది...

అలాగా...అనునయంగా అన్నాడు...

ఇదిగో...ఇదీ పాస్ అంటే... జేబులో వున్న పాస్ బైటికితీసి చూపించాడు సీతాపతి.

ఐ సీ... అంటూ నిశితంగా పేసు వంకే కళ్ళార్పకుండా చూశాడు ఆగంతకుడు...

అన్నట్టు మీ పేరు గోపాలమా?— కాదండీ...

ఇందాకటి వరకూ మీ ప్రక్కనే వున్న గార్డుగారు మిమ్మల్ని శీతాపతి అని పిలుస్తున్నారు...

అవునండీ! నాపేరు సీతాపతి...ఈ పాసు మావాడిదే నవ్వేస్తూ అన్నాడు.

అయితే ఒకరిపాసు ఇంకోకరు వుపయోగించుకోవచ్చున్న మాట?

అమ్మమ్మా!— ఎంతమాత్రమూ కాదు— అలా చేస్తే పెద్దనేరం! — ఏదో అప్పుడప్పుడు అవసరంకొద్దీ ఆపద్ధర్మంగా ఇట్లా వాడుకుంటూ వుంటాం...

ఐ...సీ...

లంచం ఇవ్వటం... పుచ్చుకోవటమూ ఎంత నేరమో ఇదీ అంతే! —

అంటే...?

ఇలాంటిపాసు పై అధికారుల ఎవరి చేతుల్లోనైనా పడితే ఇచ్చినవాడిని...తీసుకున్న వాడినీ... ఇద్దర్నీ డిస్మిస్ చేస్తారు...

పాపం!...

అంతేనండీ! హుషారుగా జవాబిచ్చాడు శీతాపతి...

దెన్ యు ఆర్ మోస్ట్ అన్లక్కీ...

అదేమిటి... తెల్లబోయాడు శీతాపతి.

అయామ్ సారీ...అంటూ శీతాపతి చూపించిన రైల్వే పాస్ జేబులో పెట్టుకున్నాడు ఆ అగంతకుడు.

శీతాపతికి పరిస్థితేమిటో బోధపడ్లేదు. నోటమాట రాలేదు—

Mr. శీతాపతి-యుడిడ్ ఎక్స్ట్రీమ్. ఈపాసు కాన్ఫిసికేట్ చేస్తున్నాను... బై ది బై ఐయామ్ రాజశేఖరం! — సెంట్రల్ స్క్వాడ్ చెక్కింగ్ అఫీషియల్...

శీతాపతి స్థంభించిపోయాడు. గుండె ఆగినంత పనైంది-ఉచ్ఛ్వాస నిశ్వాసాలు బందయినయ్...మనిషి వణికి పోనారంభించాడు.

ఏదో స్టేషన్లో రైలు ఆగింది—

ఒక్కదూకులో శీతాపతి కంపార్టుమెంటులోంచి బైట కొచ్చి గార్డువేన్ వైపు పరుగెత్తాడు —

ఏమిట్రా హడావుడి శీతాపతీ!

కొంపలంటుకున్నయ్ - మనిషి ఆయాసపడుతూ అసలు విషయమేమిటో చెప్పలేకపోతున్నాడు.

ఏం జరిగిందిరా! - శీతాపతి రెండు భుజాలు పట్టుకుని కుదుపుతూ రెట్టించి అడిగాడు గోపాలం.

జరగకూడనిదే జరిగింది - ఇందాకటి నుంచి నా కంపార్టు మెంటులో అప్పర్ బెర్తుమీదున్న వ్యక్తి చెక్కింగ్ ఆఫీషియల్ట — ఆమాట ఈమాట చెప్పి నువ్విచ్చిన పాస్

కాఫిన్ కేట్ చేసి కూర్చున్నాడు - పైగా రిపోర్టుకూడ వ్రాస్తు న్నాడు - నువ్వు రారా బ్రదర్ - నువ్వే నన్ను కాపాడాలి!.

శీతాపతి హడావిడిచూచి గోపాలం కూడా అతనితో కంపార్టుమెంటు కేసి నడిచాడు...

గోపాలం కిటికీలోంచి లోపలికిచూస్తూ "అవున్రా సీతా పతి... ఈసెంట్రల్ స్క్వాడ్ వాళ్ళతో వచ్చిన చిక్కే- ఇది... ఎవ్వరిమాట వినరు— వాళ్ళు పట్టిన కుందేటికి మూడే కాళ్ళం టారు... ఇప్పుడేమిటి చెయ్యటం!"... ప్లాటుఫారం మీద నిల్చునే అన్నాడు—

ఇంజను కూత వేసింది —

"సరే సీతాపతి చూడు- ఈ విషయంలో నాకూ భయం గానే వుంది - నువ్వే ఎట్లాగైనా అతగాడ్ని బ్రతిమిలాడో.... భంగపడో ఆ పాసు వెనక్కు తీసుకో... లేకుంటే ఈ కేసులో ఇద్దరం ఇన్వాల్వ్ కావాల్సి ఉంటుంది" —

అనేసి జండావూపుకుంటూ వెళ్ళిపోయాడు గోపాలం.

శీతాపతి బిక్కచచ్చిపోయాడు - ఏం చేయటానికి కాలూ చెయ్యి ఆడటంలేదు...

చెమటపట్టిన ముఖాన్ని కర్చీపుతో తుడుచుకుని గబ గబా కంపార్టుమెంటులోకొచ్చాడు...

తీవిగా సిగరేట్ కాలుస్తున్న రాజశేఖర్‌ను సమీపించిన సీతాపతి వాడిపోయిన వదనంతో "సార్...క్షమించండి సార్...

ఏదో పొరపాటై పోయింది..." దీనంగా అన్నాడు

నో...నో...ఐకాంట్ హెల్ప్!—

సార్! మీరు కాదంటే నా లైఫ్ స్పాయిలై పోతుంది సార్... పదేళ్ళ సర్వీసు పైగా ఆరుగురు పిల్లలున్న పెద్ద సంసారం నాది...

సీతాపతి పూర్తిగా నీరుకారిపోయాడు - ఏడుపొక్కటే తక్కువ.

కొడుకు పుట్టాడనే కొండంత ఆశతో బయల్దేరాడు. మధ్యలో అనుకోని అవాంతరం ఎదురైంది.

ట్రయిన్ నాలుగైదు స్టేషన్లు దాటే వరకూ అభిమానాన్ని చంపుకున్న సీతాపతి రాజశేఖరం కాళ్ళావేళ్ళాపడి బ్రతిమాలు తూనే వున్నాడు.

డోన్ట్ బిసిల్లీ సీతాపతి. చదువుకున్నావ్. వుద్యోగం చేస్తున్నావ్. ఎడ్యుకేటెడ్ అయివుండి మీరే డిపార్టుమెంటునీ-ప్రభుత్వాన్ని చీట్ చేస్తున్నారన్నమాట...

చేతులు పిసుక్కుంటున్న సీతాపతికి కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి—

డోన్ట్ వీప్...పై అధికారిగా నేను ఏ విధంగానూ సాయపడలేను...

అవును తను చేసింది తప్పే. అందుకు తన వుద్యోగమే పోగొట్టుకోవాల్సిన దుస్థితి వచ్చింది- అంతే కాదు- గోపాలం కూడా ఇందులో ఒక భాగస్వామి అయ్యాడు-అందుక్కారణం తానే-

ఇప్పుడెట్లా? ఏమిటి చెయ్యటం....

కంపార్టుమెంటులో తాను, రాజశేఖరం తప్పించి మరో వ్యక్తి ఎవ్వరూ లేరు-

సార్.... ఈ వక్క సారికి క్షమించండి దీనాతిదీనంగా వేడుకుంటూ కాళ్ళమీదపడ్డ సీతాపతి. బావురుమన్నాడు.

రాజశేఖరం ఒక క్షణం తీవ్రంగా ఆలోచించి మళ్ళీ సిగరెట్ వెలిగించాడు.

మీరు క్షమించానసే వరకూ నేను మీ కాళ్ళు విడిచి పెట్టను--ఇది నా లైఫ్ ప్రాబ్లమ్-...ఇంకా వేడుకుంటూనే వున్నాడు సీతాపతి.

సీతాపతి రోదనవిని రాళ్ళుకూడా కరిగిపోతాయ్. అందు చేత నే రాజశేఖరంలో కూడా చలనం కన్పించింది-

''గెటప్ మిస్టర్ సీతాపతీ! దెన్ యు డూ వన్ థింగ్ నేను నీకు సాయం చేస్తాను. యు టూ మస్ట్ హెల్ప్ మి''...

''నా ప్రాణాలైనా ఇస్తాను సార్''.... కళ్ళు తుడుచు కుంటూ అన్నాడు.

ఈ విషయం నీలోనే వుండిపోవాలి!- మరొకరికి తెలియ కూడదు- నెల్లూరులో దిగుతాను. రాత్రంతా లాడ్జింగులో వుంటాను. మళ్లీ తెల్లవారేలోగా ఒక్క వెయ్యి రూపాయలు తెచ్చి నాకివ్వు— దట్సాల్!

ఆ మాటలు వినేసరికి సీతాపతికి పోయిన ప్రాణం తిరిగి వచ్చినట్లయింది—

ఓస్ ఇంతేనా అనుకున్నాడు—

ప్రస్తుతానికి సరేనని తెలూపేడే కానీ ఇప్పటికిప్పుడు తను అంత డబ్బు ఎలా తేగలడు?— జేబులో తన దగ్గర పాతిక రూపాయలకంటే లేవు-

పోనీ... గోపాలాన్నడిగితే!-

వాడి దగ్గర అంత డబ్బెందుకుంటుంది. పైగా ఈ విషయం మరొకరికి తెలియకూడదామె?-

ట్రయిన్ నెల్లూరు స్టేషన్లో ఆగింది!

గోపాలం సెకండ్ క్లాస్ కంపార్టుమెంటు దగ్గరకొచ్చేసరికి సీతాపతి కన్పించక పోవటం ఆశ్చర్యమన్పించింది. గోపాలంలోకూడా ఆదుర్దా అవధులు దాటుతోంది.

*　　*　　*

రాజశేఖరం కరుణించి తనమీద కేసు బుక్ చేయకుండా వదిలిపెట్టబోతున్నాడనే ఆనందం ఒకవేపు... అతనికి ముట్టచెప్పాల్సిన వెయ్యిరూపాయలూ నిల్చున్నపళాన తెచ్చియివ్వడం ఎట్లాగనే ఆందోళన మరో వైపూ... సీతాపతిని సతమతంచేసి వేధిస్తున్నయ్—

నెల్లూరు తనకు కొత్త! తనకు తెల్సిన వాళ్ళంటూ ఎవ్వరూలేని ఈకొత్తప్రదేశంలో తను వెయ్యిరూపాయలు ఎలా పుట్టించగలగటమనేదే ఒక పెద్ద సమస్యగా తయారైంది.

స్టేషన్ మాస్టర్ దగ్గరకెళ్ళి తనను తాను పరిచయం చేసుకున్నాడు. ఎట్లాగైనా డబ్బు సర్దమంటూ కోరాడు. తర్వాత

పార్శిల్ క్లార్కుని... అక్కడి టిక్కెట్ ఇన్‌స్పెక్టర్నీ... అడిగి లేదనిపించుకోవటమే మిగిలింది.

పోనీ వూళ్లో తెల్సిన వాళ్ళెవరైనా కలుస్తారేమోనని నాలుగువీధులూ పిచ్చివాడిలా తిరిగేడు.

సాయంత్రం ఆరుగంటలు కావస్తోంది.

తనఅవసరం గడిచేదెట్లా - తను ఈ గండంనుంచి బైట పడేదెట్లా?

వీధి దీపాలు వెలిగాయి.

సీతాపతి ఇంకా తిరుగుతూనే వున్నాడు.

రోడ్డు ప్రక్కగా ఆగివున్న ఫియట్ కార్లో ఒక వ్యక్తి కూర్చునివుండటం చూశాడు.

అవును అతనే...తన మామగారి ఇంటిఎదురుగా వుండే వ్యాపారస్థుడు రంగధామరావే!-

అమ్మయ్య! అతగాడ్ని చూడగానే ప్రాణం లేచొచ్చి నట్టయింది.

కారుదగ్గరి కెళ్ళగానే సీతాపతిని చూస్తూ అతనే పలకరించాడు.

ఏమండీ ఇక్కడున్నారు!-

మరేం లేదండీ... ఆఫీసు డ్యూటీమీద వచ్చాను... సమయానికి మీరు కన్పించారు...

"ఏమిటి విషయం?— రండి!..."

శీతాపతి కూడా కార్లో కూర్చుని 'చూడండీ... డ్యూటీలో వస్తుండగా అనుకోని అవాంతరం వొకటి వచ్చింది.

అర్జంటుగా నాకో వెయ్యి రూపాయలు కావాలి. నేను రేపే మామగారింటికొచ్చి మీకు ఇచ్చేస్తాను—ప్రస్తుతానికి అంత మొత్తాన్ని మీరు సర్ది సాయపడాలి తప్పదు. అవసరం అలాంటిది...' గుక్క తిప్పుకోకుండా మాట్లాడేశాడు.

'ఓస్ అదెంతపని...మీరు ఇవ్వరన్న అనుమానం నాకు లేదు— మీరివ్వటం ఆలస్యమైనా మీ మామగారి నడిగైనా తీసుకోగల్ను ... ఇందు తీసుకోండి ...' టెర్లిన్ లాల్చీ జేబు లోంచి పది వందరూపాయల నోట్లు అందించాడు —

అనుకోకుండా మిమ్మల్ని కల్సుకున్నందుకు కాదనకుండా దేవుడిలా మీరు నా అవసరానికి ఆదుకున్నందుకు ... మీకు చాలా ఋణపడి వుంటాను...

అనేసి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ రాజశేఖరం లాడ్జింగ్ వైపు నడిచాడు సీతాపతి—

నడుస్తున్న సీతాపతికి వెయ్యి ఏనుగుల బలం వచ్చినట్టనిపించింది.

లాడ్జింగ్ రెండో అంతస్తులోకి వెళ్ళి 24-వ గది ముందు నిల్చుని కాలింగ్ బెల్ నొక్కాడు సీతాపతి.

గది తలుపులు తెరుచుకున్నాయి—

గదిలోకి ప్రవేశించిన సీతాపతి వెంటనే గది తలుపులు మూసేసి వచ్చి వినయంగా రాజశేఖరం ముందు నిల్చున్నాడు—

డబ్బు చేతికి అందిస్తూ మీమేలు ఎన్నటికీ మర్చిపోను సార్!— అబ్బాయి పుట్టాడనే సంతోషంలో ప్రయాణమై బయల్దేరేను ..మాఅబ్బాయికి మీపేరే పెట్టుకుంటాం సార్...

అర్ధానందంతో అన్నాడు సీతాపతి...

దట్సాల్ రైట్.. మరెప్పుడూ... ఇలాంటి పన్లు చెయ్యక — ఈసారి కేదో నువ్వు పిల్లలు గలవాడివి గదాని విడిచిపెటాను - బి కేర్ ఫుల్... యు కెన్ గో...

తిరిగిచ్చిన పాస్ చేతిలోకి తీసుకున్న సీతాపతి చిగిర్చిన సంతోషంతో తిన్నగా రైల్వేస్టేషను కేసి నడిచాడు.

*            *            *

అత్తవారింట్లో వున్న నాలుగు రోజుల్లో తన కొడుకుని చూదిన ప్రతిక్షణమూ గడచిన సంఘటనే మనసులో మెదిలేది సీతాపతికి.

అయిదోరోజు ఉదయం వరండాలో వున్న పేము కుర్చీలో కూర్చుని కాఫీ తాగుతూ పేపరు చదువున్న సీతాపతికి ఒక ముఖ్య ప్రకటన కన్పించింది పేపర్లో —

అందులో ఇలా వుంది —

"ఒక రైల్వే అధికారి పోగొట్టుకున్న చెకింగ్ ఐడెంటిఫికేషన్...వారెంట్‌ను దుర్వినియోగం చేస్తూ ఎవరైనా ఎవరినైనా మోసం చేస్తుంటే అలాంటివ్యక్తిని పట్టుకుని రైల్వే అధికారులకు గానీ... పోలీసు వారికి గానీ.... పట్టి అప్పగించవలసినది."

సీతాపతి అది చదివేక తెల్లమొహం వేశాడు. ఆరోజు తాను మోసపోయా డన్నమాట : తాను చీట్ చేయబడ్డాడు అందుకు సిగ్గుపడ్డాడు పైగా దగాపడ్డాడు...

(జూలై 74 నిర్మల మాసపత్రికలో ప్రచురితము.)

★